క్లుప్తంగా

యోహానుకు సత్కారం



తాడేపల్లిరూరల్: గుర్రం జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు, సాహితీరత్న పెద్దేటి యోహానును వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ ప్రముఖ నాటక రచయిత పెద్దేటి యోహానుకు ఐఎస్ గుర్తింపు పొందిన జాతీయ సాహిత్య, సాంస్కృతిక, భాషా సేవా సంస్థ, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఉగాది పురస్కారాన్ని ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దేటి యోహానును సత్కరించామన్నారు. కార్యక్రమంలో అక్షయ సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షురాలు వి.మేరీసుజాత, కాకా వెంకటేశ్వర్లు, బులుసుపాటి యల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలసబస్టాండ్ సెంటర్‌లోని షిరిడీ సాయినాథ మందిర 21వ వార్షిక మహోత్సవాలు 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాలకవర్గ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం నగర సంకీర్తన, గణపతిపూజ, పుణ్యాహ వచన, నవగ్రహ ఆరాధన, పంచామృత స్నపన ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగిస్తారన్నారు. మంగళవారం సాయిచాలీసా, హనుమాన్‌చాలీసా పారాయణం గీతాభజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం స్వామికి విశేష అర్చన, అభిషేకాలు, ఉత్సవమూర్తికి భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 9 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారన్నారు.

ఇంటర్ విద్యార్థులకు స్టేషనరీ అందజేత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి నూరుశాతం ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం చుండూరు భాస్కరరావు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ఫిరంగిపురం: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం పోలీసు సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఉత్తర్వుల మేరకు గంజాయి తాగేవారు, అమ్ముతున్న వారి కోసం పలు కాలనీల్లో, బహిరంగ ప్రదేశాలు, పాడుబడిన భవనాల వద్ద ఈ తనిఖీలు చేశామన్నారు. వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎస్ఐలు మోహన్‌రావు, శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు తొలగిన విఘ్నాలు

- విద్యుత్ స్తంభాలు మార్చే ప్రక్రియ మొదలు పెట్టిన విద్యుత్ శాఖ అధికారులు
- త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- రెండు నియోజకవర్గాల ప్రజలకు మేలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో రెండు ప్రాంతాలను కలుపుతూ సుమారు 14 కి.మీ. పొడవునా ఉన్న రేవేంద్రపాడు, సీతానగరం రహదారికి ఎట్టకేలకు విఘ్నాలు తొలగాయి. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ విద్యుత్ స్తంభాలు మార్చే విషయంలో కొంత ఆలస్యం జరిగింది. విద్యుత్ శాఖ అధికారులకు ఆర్ అండ్ బీ అధికారులు చెల్లించాల్సిన 5 కోట్ల రూపాయలు చెల్లించడంతో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలు మార్చే పనిలో పడ్డారు. ఈ రోడ్డు నిర్మాణానికి మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వరకు 7 మీటర్ల రహదారి నిర్మించేందుకు 14 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మించే సమయంలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు అడ్డురావడం, వాటిని మార్చేందుకు విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయాల్సి రావడంతో ఆర్అండ్‌బీ అధికారులు విద్యుత్ శాఖకు



విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన టవర్లు

చెల్లించాల్సిన నగదును చెల్లించడంలో కొంత జాప్యం జరిగింది. ఎమ్మెల్యే ఆర్కే కృషి వల్ల విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన డబ్బులు ఆర్అండ్‌బీ అధికారులు చెల్లించడంతో విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. మొత్తం 100 ఐరన్ టవర్స్ ఏర్పాటు చేయాల్సిఉండగా ఇప్పటికే 45 టవర్లకు ఫౌండేషన్ ఏర్పాటు చేసి, 7 టవర్ల పనులు పూర్తి చేశారు. సాధ్యమైనంత వరకు నెల రోజుల వ్యవధిలో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ తెలియజేశారు.

ప్రమాదాల నివారణ

ఈ రహదారిలో తెనాలి నుంచి విజయవాడ వెళ్లేవారు, దుగ్గిరాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు విజయవాడ మార్కెట్‌కు తరలించేవారు, యూనివర్సిటీ విద్యార్థులు వేల సంఖ్యలో ప్రయాణిస్తారు. ప్రస్తుతం బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిగా పాడైపోవడం, మార్జిన్ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం, వికలాంగులు కావడం జరిగింది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తెనాలి నుంచి విజయవాడ వెళ్లేందుకు సుమారు 10 కి.మీ. దూరం తగ్గుతుంది. దుగ్గిరాల మండలంలో రైతులు పండించిన పంటలను విజయవాడ మార్కెట్‌కు తరలించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడి, కొలనుకొండ, ఇప్పటం, వడ్డేశ్వరం, కుంచనపల్లి ప్రాంత వాసులు కూడా ఇదే రహదారిని ఎక్కువ మంది ఉపయోగిస్తారు. ప్రతి రోజూ వడ్డేశ్వరంలో ఉన్న యూనివర్సిటీ నుంచి సుమారు 350 బస్సులు ఇదే రహదారిలో ప్రయాణిస్తాయి. ఈ రహదారి నిర్మించడం వల్ల ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రజా రంజక పాలన

- నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- అనంతవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

అనంతవరం(తాడికొండ): దేశంలోనే ప్రజా రంజక పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. తొలుత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేసిన అనంతరం ఆయన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. డ్రైనేజీ సమస్య, గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవడం, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారం దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ అనంతవరం గ్రామానికి మొత్తం రూ.20,8,5058లను వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించినట్లు తెలిపారు. పలు సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు నగదు ఖాతాల్లో జమ చేయడంతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు రూ.4 లక్షలు, నీటి సరఫరాకు రూ.4.30 లక్షలు, కల్వర్టు నిర్మాణానికి రూ.1.50 లక్షలు, గ్రామ పంచాయతీ మరమ్మతులకు రూ.లక్ష, నాడు–నేడు ఫేజ్–1 కింద ఎంపీపీ స్కూల్ నిర్మాణానికి రూ.14 లక్షలు, కమ్యూనిటీ, శానిటరీ కాంప్లెక్స్ నూతన భవనానికి రూ.3 లక్షలు, నాడు–నేడు ఫేజ్–2 కింద జెడ్పీ హైస్కూల్‌కు రూ.1.24 కోట్లు కేటాయించడం జగనన్నకు ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అందరూ అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ తిరిగిన సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- పంచాయతీ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సమీక్షలో తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



ఈవోపీఆర్డీలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం గుంటూరులోని తన కార్యాలయంలో ఈవోపీఆర్డీలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పంచాయతీలోని ప్రధాన ఆదాయ వనరులపై దృష్టి సారించి ఇంటి పన్ను, కుళాయి రుసుం, లైసెన్స్ ఫీజులు వంటివి నూరుశాతం వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తే పన్నుల వసూళ్లు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని చెరువులు, కుంటలు, వాగులు వద్ద ప్రభుత్వ భూముల్లో ఆదాయాన్ని సమకూర్చే మొక్కలు నాటాలని సూచించారు. సచివాలయాల్లో ఉద్యోగులు, వలంటీర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. సచివాలయాల్లో ప్రజల సమస్యపై వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో 4 మండలాల ఈవోఆర్డీలు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో సచివాలయ సిబ్బంది

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్‌కు రావాల్సిన పన్నుల బకాయిలు పెండింగ్ పడటంతో ఆదివారం సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేసే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ వ్యాప్తంగా 50 శాతం మంది మాత్రమే పన్నులు చెల్లించడంతో కమిషనర్ శారదాదేవి ఆదేశాల మేరకు కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది 100 శాతం పన్నులు వసూలు చేసే దిశగా అడుగులు వేశారు. ఉదయం 6 గంటల నుంచి ప్రతి వీధిలో ప్రతి ఇంటికి తిరిగి పన్నుల వసూలు చేపట్టారు. ఇళ్ల యజమానులు కూడా పన్నులు చెల్లించడానికి ఉత్సాహం చూపించడంతో కార్పొరేషన్ సిబ్బంది పన్నుల వసూలు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలియజేశారు. పన్నులు వసూలు చేస్తున్న సమయంలో ఖాళీ స్థలాలకు పన్ను వేయాలని, నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగిపోయి ఇబ్బందిగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆ ఫిర్యాదును స్వీకరించి ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

బియ్యం అక్రమ తరలింపు లారీ పట్టివేత



మేడికొండూరు: అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ బియ్యం బస్తాల లోడు లారీని మేడికొండూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గుంటూరు నల్లచెరువు ప్రాంతాల్లో సేకరించిన ప్రజా పంపిణీ బియ్యం 87 బస్తాలు లారీలో లోడు చేసి నరసరావుపేటకు తరలిస్తున్నారు. మేడికొండూరు పోలీసులకు అందిన సమాచారం మేరకు పేరేచర్ల జంక్షన్‌లో బియ్యం లోడు లారీని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు గుంటూరు నల్లచెరువుకు చెందిన దావల రాజేష్, ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరుకు చెందిన చింతా గోపీరామ్‌పై కేసు నమోదు చేశారు.

నేడు అనంతవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో సోమవారం 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్లంబర్స్‌కు ఉచిత దంత వైద్య శిబిరం

మంగళగిరి: నగర పరిధిలోని ప్లంబర్స్‌కు ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. విజయ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఆస్ట్రాల్ పైప్స్ వారు దంత వైద్య శిబిరం నిర్వహించి ప్లంబర్స్‌కు అవగాహన కల్పించారు. ఆరోగ్య బీమా ఉపయోగాలను వివరించారు. సదస్సులో విజయ ట్రేడర్స్ అధినేత భోజనపల్లి ప్రసాద్, ఆస్ట్రాల్ పైప్స్ ఏఎస్ఎం ప్రసాద్, కళ్యాణి డెంటల్ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రాజా, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ డాక్టర్ కె.కీర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ భూముల్లో ఆక్రమణల తొలగింపు

మంగళగిరి: కాజ జాతీయ రహదారి వెంట దేవదాయ శాఖ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను ఆదివారం తొలగించారు. పంట కాలువను పూడ్చి నిర్మాణాలు చేపట్టడంతో పాటు దేవదాయ శాఖ భూములను ఆక్రమించి షెడ్లను నిర్మించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో దేవదాయ శాఖ భూములను వేలానికి పాడుకున్న టీడీపీ నేత పల్లబోతు శ్రీనివాసరావు సోదరుడు మూర్తిరాజులు దేవదాయ శాఖ నుంచి సాగుపేరుతో ఏడాదికి రూ.30 వేలకు పాడుకుని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి ఏడాదికి రూ.6 లక్షలకు సబ్‌లీజుకు కట్టబెట్టారు. ఆ భూముల్లో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పలు నిర్మాణాలు చేపట్టింది. 2018 జనవరిలో పంట కాలువ భూములు, దేవాలయ భూములు ఆక్రమణల వ్యవహారాన్ని సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకువచ్చింది. అప్పటి అధికారులు నోటీసులతో సరిపెట్టారు. అనంతరం నాన్‌పొలిటికల్ జేఏసీ నేత అప్పికట్ల శ్రీహరి నాయుడు స్పందనలో ఫిర్యాదు చేయడంతో



తొలగించిన రేకుల షెడ్డు

స్పందించిన అధికారులు ఆదివారం అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. తొలగింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏసీ బొంతు మహేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈఓలు చిన వెంకటరెడ్డి, పుణ్యాల వెంకటరెడ్డి మరో 20 మంది దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శన

ముఖ్యఅతిథిగా అడిషనల్ డీజీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో ఉన్న ఎమీ ఇంటర్నేషనల్ స్కూల్ (ఏఐఎంఈఈ) (ఎయిమ్స్ ఎడ్యుకేషన్ ఎం–పవర్) రెండవ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ మన ప్రాంతంలో ఇంటర్నేషనల్ హంగులతో నిర్మించిన ఎమీ స్కూల్ ఉండటం ఎంతో సంతోషించదగ్గ విషయమని చెప్పారు. పిల్లల భవిష్యత్తు కోసం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో విద్యాబోధన అందించడం పోటీ ప్రపంచంలో ఎంతో అవసరమన్నారు. అనంతరం ఎమీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ వి.రామకృష్ణ, కార్డియోవాసిక్యులర్ అనస్తిస్ట్ డాక్టర్ చిగురుపాటి కీర్తి, ఎమీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ దంటు ఓంకార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దంటు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే పైపులైను లీకేజీతో తాగునీరు వృథాగా పోతుండటంతో ఆదివారం కార్పొరేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే తాగునీటి పైపులైన్లు లీక్ అవుతున్న విషయాన్ని సిబ్బంది తెలియజేశారని, డీఈ కృష్ణారెడ్డితో మాట్లాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండు గంటలు తాగునీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు నిర్వహించినట్లు వివరించారు. ఒక్క ట్యాంక్ వద్ద మాత్రమే కాకుండా గ్రామంలో పలుచోట్ల పైపులైన్లు లీక్ అవుతుండటం గుర్తించి మరమ్మతులు నిర్వహించినట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడేపల్లిరూరల్: పెనుమాకలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని మానవ సేవా సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 600 మందికి పైగా వైద్య సేవలను పొందారని చెప్పారు. గతంలో మానవ సేవా సంస్థ ద్వారా కాజా, రేవేంద్రపాడు, ఈమని, దుగ్గిరాల, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వినమ్, డాక్టర్ ఆరాధ్య, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వంశీ, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ బాషా తమ సేవలను అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. వైద్య శిబిరంలో మానవ సేవా సంస్థ సభ్యులు శివారెడ్డి, గోపి, రమేష్, సుధాకర్, వెంకటాద్రి, టి.బాపనయ్య, హనుమాన్, శ్రీను పాల్గొన్నారు.